ఈనాడు
మంచిర్యాల

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి



దండేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, పక్కన కలెక్టర్, డీసీపీ

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు మహాత్మా గాంధీ ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. దండేపల్లిలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇకపై ప్రశాంత మంచిర్యాల కోసం కృషి చేస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదన్నారు. మహాత్ముడు చూపిన బాటలో నడవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రాష్ట్రంలోనే మొట్ట మొదటగా ఎమ్మెల్యే మద్యపాన నిషేధానికి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. డీసీపీ భాస్కర్‌రావు, ట్రైకార్ ఛైర్మన్ తిరుపతి, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రేమ్‌చంద్, జిల్లా, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దండేపల్లిలో...

బతుకమ్మ పేర్చి.. ఆడిపాడి

దండేపల్లి, న్యూస్‌టుడే : బతుకమ్మ సందడి మొదలైంది... తొమ్మిది రోజుల పాటు సాగే పండుగ మొదటి రోజైన ఎంగిలి బతుకమ్మను పురస్కరించుకుని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. రంగురంగుల పుష్పాలతో బతుకమ్మలు పేర్చి కూడళ్ల వద్దకు తీసుకువచ్చి రాత్రి వరకు ఆడారు.

మేం సర్వే చేయలేం!

● కలెక్టర్‌కు వ్యవసాయ విస్తరణాధికారుల వినతి

మంచిర్యాల గ్రామీణం, జైపూర్‌- న్యూస్‌టుడే

రాష్ట్ర వ్యాప్తంగా పండిస్తున్న పంటల సాగును డిజిటలీకరణ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'డిజిటల్ పంట సర్వే' పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. సర్వే పక్కాగా చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ విస్తరణాధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను, శిక్షణను సదరు ఏఈవోలకు ఇప్పటికే అందించింది. నిబంధనల ప్రకారం సర్వేను ప్రారంభించాల్సిన అధికారులు సిబ్బంది కొరత, పని ఒత్తిడి వంటి కారణాలతో సర్వేను చేసేది లేదని జిల్లా వ్యవసాయాధికారి, కలెక్టర్‌లకు ఇప్పటికే నివేదించారు. ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్రస్థాయిలో సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఏఈవోల్లో ఆందోళన నెలకొంది.

దేశవ్యాప్తంగా అహార భద్రత, పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో కలిగే పంట నష్టాన్ని అంచనా వేసేందుకు, అహారధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ వంటి సదుపాయాలను సక్రమంగా అమలు చేసేందుకు డిజిటల్ సర్వే ఎంతో ఉపయోగపడుతుందనే లక్ష్యంతో సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ అగ్రి మిషన్ పథకం ద్వారా దీన్ని అమలు చేసేందుకు రూ. లక్షల నిధులు వెచ్చిస్తుంది. ఈ సర్వే సాఫీగా చేసినట్లయితే రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నట్లు ప్రభుత్వ అంచనా వేస్తుంది. సర్వేలో అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు సమాచారం.

జిల్లాలోని మండలాలు, ఏఈవోలు, సర్వే చేయాల్సిన భూమి వివరాలివే..

- మొత్తం మండలాలు : 18
- పంచాయతీలు : 311
- వ్యవసాయశాఖ డివిజన్లు: 04
- మొత్తం క్లస్టర్లు : 55
- మొత్తం ఏఈవోలు : 54 (49 రెగ్యులర్, 05 అవుట్‌సోర్సింగ్)
- సాగు విస్తీర్ణం (ఎకరాల్లో): 3.36 లక్షలు

జిల్లాలో నాలుగు డివిజన్లలో రైతులు, సాగు విస్తీర్ణం వివరాలు

డివిజన్	రైతులు	ఎకరాలు
బెల్లంపల్లి	20,878	47,548
భీమిని	37,537	86,136
చెన్నూరు	56,718	1,11,137
మంచిర్యాల	61,971	91,979

◆ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సర్వే చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. పలు ప్రైవేటు కంపనీలకు సర్వే బాధ్యతల అవకాశం కల్పించారు. దీన్ని గుర్తించిన స్థానిక వ్యవసాయ విస్తరణాధికారులు మన రాష్ట్రంలోనూ ఏఈవోలకు సహాయకులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. అధిక పనిభారంతో ఇప్పటికే ప్రభుత్వం రూపొందించిన 49 రకాల పనులు చేస్తున్న ఏఈవోలకు ఈ సర్వే మరింత భారంగా మారుతుందని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

◆ ఒక్కో క్లస్టర్ పరిధిలో ఒక ఏఈవోకు 6 నుంచి 13వేల ఎకరాల భూములు కేటాయించారు. ఈ భూములను పరిమిత వ్యవధిలో సర్వే చేయడం కష్టంగా ఉంటుందని వాపోతున్నారు. డిజిటల్ సర్వే ప్రకారం ఒక్కో ఏఈవో తన పరిధిలోని వ్యవసాయ భూముల్లోని సర్వే నెంబర్ల వారీగా సాగుచేసిన పంటల వివరాలు, ఫొటోలు, ఇతర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ పనులు అధికభారంగా ఉంటాయని సకాలంలో చేయడం అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందించడంలేదని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డిజిటల్ పంట సర్వే చేయలేమని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు విన్నవిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులు

పట్టని ప్రణాళిక



మంచిర్యాలలోని లక్ష్మీ సినిమా టాకీసు జంక్షన్ నుంచి గోపాల్‌వాడ, హమాలీవాడ మీదుగా 100 అడుగుల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మించాలి. హైటెక్‌సిటీ కాలనీ పక్కన ఈ రహదారి స్థలం తమది అంటూ ఓ పరిశ్రమ యజమాన్యం కోర్టులో కేసు వేయడంతో వివాదాస్పదంగా మారింది. రెండేళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అక్కడ రైల్వే ఎత్తు వంతెన నిర్మాణానికి రూ.57 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆ స్థలం కోర్టు కేసులో ఉండటంతో అప్పుడు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.



మంచిర్యాలలోని సున్నంబట్టీవాడ ప్రధాన రహదారి నుంచి లయన్స్ క్లబ్ భవనం వరకు రెండేళ్ల కిందట 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారిపై రూ.2 కోట్లతో బీటీ నిర్మించారు. ఆ తర్వాత స్థలంలో ప్రైవేటు వ్యక్తుల పట్టా భూములు ఉండటంతో రహదారి నిర్మాణంపై యజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. ఆ భూసమస్యలను అధికారులు ఇప్పటికీ పరిష్కరించలేదు.

◆ మరో చోట గోపాల్‌వాడ నుంచి ఆదర్శనగర్‌కు వెళ్లేదారిలో కూడా కొందరి రైతుల పట్టా భూములు ఉండటంతో అక్కడ కూడా రహదారి నిర్మాణానికి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆది నుంచి నిర్లక్ష్యమే చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాలకు ప్రధాన కేంద్రంగా మారిన మంచిర్యాలలో భవన నిర్మాణ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే పట్టణంలో తూర్పు వైపు సగభాగం రెండు వందల అడుగుల బైపాస్ రహదారి కూడా నిర్మించారు. పశ్చిమ వైపు భూసేకరణ సమస్యతో జాప్యమవుతోంది. పట్టణంలో గతంలో ఏర్పాటు చేసిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించకపోవడంతో అక్కడక్కడా కబ్జాకు గురవుతున్నాయి.

మంచిర్యాల పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత 1977లో మాస్టర్ ప్లాన్ రహదారులకు ప్రతిపాదనలు చేశారు. అనంతరం 2013లో రివైజ్డ్ చేశారు. అప్పుడు కొంతమంది పలుకుబడితో తమ పట్టా భూముల నుంచి రహదారి నిర్మించవద్దనే ఉద్దేశంతో మాస్టర్ ప్లాన్‌ను మధ్యమధ్యలో స్వల్ప మార్పు చేయించారని ఆరోపణలున్నాయి. రెండోసారి రూపొందించిన రహదారిలో స్థానిక గోపాల్‌వాడ నుంచి ఆదర్శనగర్, వేములబస్తీ, తిలక్‌నగర్, సున్నంబట్టీవాడ వరకు మధ్యమధ్యలో ఒక మీటరు నుంచి 30 మీటర్ల వరకు తేడా వచ్చింది. మరోవైపు రహదారుల నిర్మాణంలో జాప్యం చేశారు. దీంతో పాత, కొత్త రెండు ప్రతిపాదిత రహదారి స్థలాలను అక్కడక్కడ ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేశారు. అందులో ఇప్పటికే కొన్ని ఇళ్లు నిర్మించారు. చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ముడుపులు తీసుకోని వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టి మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తి చేయించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మంచిర్యాలకు తూర్పు వైపునగల తిలక్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ రహదారి మధ్యలో చాలా తేడా వచ్చింది. పాతదాని ప్రకారం రహదారి ఊరు మధ్యలో ఆటో స్టాండ్ నుంచి నిర్మించాలి. కొత్తగా తిలక్‌నగర్ ఊరు బయట నుంచి నిర్మించేలా ప్రతిపాదనల్లో మార్పు చేశారు. ప్రతిపాదిత రహదారుల మధ్య వచ్చిన తేడాతో వివాదాస్పదంగా మారింది.

ఆటా పాటా.. వేడుకల బాట

సంస్కృతి, సంప్రదాయాలపై వైద్యవిద్యార్థుల కార్యక్రమాలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ప్రభుత్వ వైద్యకళాశాల మంచిర్యాల.. భారాస ప్రభుత్వం తొలి విడతగా ఏర్పాటు కళాశాలల్లో ఇది ఒకటి. బహుశా వైద్యవిద్య అభ్యసించే వారికి, వైద్యవృత్తిలో ఉన్నవారికి తప్పితే ఇక్కడి కళాశాల తెలిసింది చాలా తక్కువ మందికే. కానీ మొదటి సంవత్సరంలోనే రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. తొలి ఏడాది పరీక్ష ఫలితాల్లో 98 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. రెండేళ్లు(రెండు బ్యాచ్‌లు)పూర్తిచేసుకుని మూడో బ్యాచ్(ఏడాది)కి సిద్ధమవుతోంది. కేవలం చదువుకే పరిమితం కాకుండా.. నిత్యం పుస్తకాలతోనే కుస్తీ పట్టి ఒత్తిడికి గురికాకుండా ఆటాపాటలతో ఉపశమనం పొందుతున్నారు ఇక్కడి విద్యార్థులు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, భక్తిబాటలో నడుస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఎక్కడెక్కడి నుంచో వచ్చామనే భావన రాకుండా.. ఇంటికి దూరంగా ఉంటున్నామనే ఆలోచన దరిచేరకుండా కుటుంబసభ్యుల మాదిరిగా కలిసి మెలిసి వేడుకలు నిర్వహిస్తున్నారు. బోధకులను సైతం భాగస్వాములను చేస్తూ జిల్లా కేంద్రంలో సందడి వాతావరణాన్ని తీసుకొస్తున్నారు.



స్వాగతోత్సవంలో..



వైద్యవిద్యలో భాగంగా జిల్లా కేంద్రంలో శిబిరంలో పాల్గొంటూ..



కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ మండపం వద్ద విద్యార్థులు

ప్రతి ఉత్సవం.. కలిసికట్టుగా..

రెండు బ్యాచ్‌లు.. రెండు వందల మంది విద్యార్థులతో కళాశాల నిండుగా కనిపిస్తుంది. మొదటి ఏడాది విద్యార్థులు సీనియర్లుగా మారిపోయారు. రెండో ఏటా చేరిన వారు సైతం త్వరలో సీనియర్లు కానున్నారు. ఏటా వేడుకలను కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది నుంచే క్రీడాదినోత్సవం, హోలీ, బ్యాచ్ పార్టీ, ఇఫ్తార్ విందు, పరీక్షల ఫలితాల అనంతరం వైభవోపేతంగా సరస్వతిపూజ, స్వాగతోత్సవం, ఆచార్యుల పదవీ విరమణ వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం, ఇటీవల ఆధ్యాత్మిక వేడుకైన వినాయక విగ్రహ ఏర్పాటు ప్రత్యేక పూజలు, రోజుకో తీరు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ప్రతి వేడుకను ఓ పద్ధతిగా, చూడముచ్చటగా జరిపిస్తున్నారు. కళాశాలలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుతున్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాల అనుమతి వచ్చింది.. సొంత భవనం లేదు. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. అయినా 98 శాతం ఉత్తీర్ణతతో తొలి ఏడాదే రాష్ట్రం మొత్తం మంచిర్యాలవైపు చూసేలా చేశారు. 24 గంటలు పుస్తకాలకే పరిమితం కాలేదు. ఆటపాటలకు దూరంగా అసలే లేరు. పేరుపొందిన వైద్య కళాశాలల మాదిరిగా ఇక్కడా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల వైద్యకళాశాలను ఔరా అనిపించేలా చేశారు.



కుటుంబ డిజిటల్ కార్డు సర్వేపై శిక్షణ

ఏసీసీ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు సర్వేను పక్కాగా చేపట్టాలని మంచిర్యాల ఆర్డీవో వి.రాములు పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సర్వే నిర్వహణపై సంబంధిత పుర కమిషనర్‌లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ప్రాంతాల్లో చేపట్టాల్సిన సర్వేపై శిక్షణ అందించారు. ఈ నెల 3 నుంచి 5 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో సర్వే నిర్వహించి 10వ తేదీన జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించాలన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జడ్పీ సీఈవో గణపతి, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సర్వే వివరాలపై శిక్షణ ఇస్తున్న ఆర్డీవో రాములు

నేటి నుంచి సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9 వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలో 3 పరీక్ష కేంద్రాలు (జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్మిల్ల) ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాలలో పదోతరగతికి, మిగతా రెండు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు అధ్యయన కేంద్రాల నుంచి 620 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పదోతరగతి, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఇంటర్ సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నారు. రాత పరీక్షల అనంతరం ఇంటర్ విద్యార్థులకు అక్టోబర్ 16 నుంచి 23 వరకు ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) జరగనున్నాయి.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కార్మల్ కాన్వెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పరిశీలన కేంద్రంలో డీఈవో యాదయ్య పర్యవేక్షణలో ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. జిల్లాలో డీఎస్సీ నియామకంలో ప్రకటించిన 288 పోస్టులకు గానూ 1:3 పద్ధతిలో మొత్తం 864 మందిని మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. ఆయా అభ్యర్థులకు సంబంధించి చరవాణులు, మెయిల్ ఐడీలకు వచ్చిన సందేశాల ఆధారంగా పలువురు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన 17 టేబుళ్ల వద్ద ఒక్కో టేబుల్‌కు కేటాయించిన ఒక ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడితో పాటు ఒక స్కూల్ అసిస్టెంట్‌లు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థుల విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. వరంగల్ ఆర్జేడీ, జిల్లా పరిశీలకులు కె.సత్యనారాయణ రెడ్డి ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని సందర్శించి నిర్వహణపై ఆరాతీశారు. మొదటి రోజు చేపట్టిన పరిశీలనలో మొత్తం 70 మంది ఎస్జీటీ అభ్యర్థులు హాజరైనట్లు డీఈఓ యాదయ్య తెలిపారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణ రెడ్డి

ప్రధాన సూత్రదారులను ఎందుకు పట్టుకోలేదు ? ఎమ్మెల్యే

చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని శనిగకుంట మత్తడి పేల్చిన నిందితులను పట్టుకొని అరెస్టు చేసిన పోలీసులు దీని వెనకాల ఉన్న ప్రధాన సూత్రదారులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేదో ఆశ్చర్యం కలుగుతుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి బుధవారం పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందో పోలీసుల వద్ద పక్కా సమాచారం ఉందన్నారు. సంఘటన జరిగిన సమయంలో ఎమ్మెల్యే నిందితులను కాపాడుతున్నారని భారాస నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మత్తడిని పేల్చిన వ్యక్తులే పోలీసుల విచారణలో భారాస, భాజపా నాయకుల ప్రమేయం ఉన్నట్లు చెప్పగా ఆ నాయకులు చెన్నూరు పట్టణం నుంచి పారిపోయారన్నారు. వారి పాత్ర లేకపోతే పోలీసుల ముందుకు వచ్చి సాక్ష్యంచెప్పి సహకరించాలని హితవు పలికారు. ఈ ఘటనలో ఎంతటి వ్యక్తుల ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. చెన్నూరు ప్రాంతంలో జూదం, డ్రగ్స్ మాఫియా సాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిని పూర్తిగా అరికట్టాలని పోలీసులను మరోసారి ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే జైలుకే : డీసీపీ

జన్నారం, న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాల్లో ఇతరులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, ఇతర గ్రూపుల్లో ఉన్న వాటిని ఫార్వర్డ్ చేసినా జైలుకు వెళ్లక తప్పదని మంచిర్యాల డీసీపీ భాస్కర్‌రావ్ హెచ్చరించారు. జన్నారం మండలంలో ఓ వర్గాన్ని రెచ్చగొట్టి గొడవలకు దారి తీసేలా ఓ వ్యక్తి సామాజిక మాధ్యమంలో మంగళవారం రాత్రి పోస్టు చేయడం పట్ల మంచిర్యాల డీసీపీ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కొందరు వ్యక్తులు యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ వేదికగా రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకొని ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మత ఘర్షణలు చెలరేగేలా, లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, జైపూర్

? మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో 15 రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు..సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన సమస్యను పరిష్కరించడం లేదు.
- రామస్వామి సుభాష్‌నగర్, జైపూర్

✔ పైపులైను లీకేజీతో పాటు వాటిని బాగు చేసే జాయింటర్ అందుబాటులో లేకపోవడం వల్ల సమస్య ఉంది. రేపటిలోగా సమస్యను పరిష్కరిస్తా. - ఉదయ్, పంచాయతీ కార్యదర్శి, జైపూర్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని కాంట్రాక్టర్ల బస్తీలో సమస్యలు తాండవిస్తున్నాయి. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుంది. - కోలిపాక శ్రీనివాస్

✔ చెత్త లేకుండా ప్రతిరోజు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నాం. కాలనీ వాసులు సైతం చెత్తను రోడ్డు మీద వేయకుండా ఒక పక్కన వేయాలి.
- సందీప్, మున్సిపల్ ఏఈ

? రవీంద్రనగర్ నుంచి పాలిటెక్నిక్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలి. - నరేష్, రవీంద్రనగర్

✔ రవీంద్రనగర్ నుంచి పాలిటెక్నిక్ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి. పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - సందీప్, మున్సిపల్ ఏఈ

అన్నదాతలకు సన్మానం

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : చెన్నూరు మండలంలోని నాగాపూర్‌లో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైజవాన్.. జైకిసాన్ నినాదం సృష్టికర్త కావడంతో గ్రామంలోని పలువురు రైతుల్ని పంట క్షేత్రాల్లోనే సన్మానించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ, భాజపా మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.


నాగాపూర్‌లో రైతుల్ని సన్మానిస్తున్న బీజేవైఎం నాయకులు

మద్యానికి బానిసై మృతి

కాసిపేట, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. ట్యాంక్‌బస్తీకి చెందిన భూక్య లాలు(43) కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా ఉంటున్నాడు. పనులు చేసుకొని, వచ్చే డబ్బులతో మద్యం తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం లాలు ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో పక్క ఇంటివారు పోలీసులు, కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మద్యం మత్తులోనే మృతి చెందాడని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

జైపూర్, న్యూస్‌టుడే : ఇందారం గ్రామంలోని దొరగారిపల్లెలో బుధవారం జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్, జైపూర్ పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో ఇందారం గ్రామానికి చెందిన ఒకరు, గోదావరిఖనికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,935 నగదు, 5 చరవాణులు, 1 ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

కోటపల్లి: కోటపల్లి మండలం శంకరాపూర్ అటవీప్రాంతంలో రహస్యంగా జూదం ఆడుతున్న నలుగురిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రాజేందర్ కథనం మేరకు.. జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేయగా నలుగురిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. పట్టుబడ్డ వ్యక్తుల నుంచి రూ.10,900, 4 చరవాణులు, స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నెన్నెల : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం జూద స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మొత్తం ఏడుగురిలో ఆరుగురిని పట్టుకున్నట్లు.. వారి నుంచి రూ.1,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక లారీల పట్టివేత

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : మందని నుంచి బెల్లంపల్లికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను మైనింగ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇసుక రెండు లారీల్లో బెల్లంపల్లికి తీసుకొస్తుండగా లారీల వేబిల్లులను పరిశీలించారు. బిల్లుల్లో తేడాలు రావడంతో లారీలను రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం జరిమానా విధిస్తామని మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.


సామాజిక మాధ్యమంలో వివాదాస్పద వ్యాఖ్యలపై కేసు

జన్నారం, న్యూస్‌టుడే : ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ఇలియాస్ అనే వ్యక్తి తిరుమల తిరుపతి లడ్డూపై మంగళవారం వాట్సాప్ గ్రూపులో వివాదాస్పదమైన వ్యాఖ్యలను ఇతర గ్రూపుల నుంచి షేర్ చేశాడు. రెండు మతాల మధ్య వివాదాలకు కారణమయ్యేలా పోస్టు ఉండటంతో జన్నారానికి చెందిన ఎరుకల రమేశ్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇలియాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మంచిర్యాలనేరవిభాగం: స్థానిక బెల్లంపల్లిచౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై సనత్‌రెడ్డి కథనం మేరకు... జైపూర్ మండలం ఇందారానికి చెందిన కొలిపాక రాజన్న కూలీ పనులు చేస్తున్నాడు. రోజులానే బుధవారం మంచిర్యాల నుంచి గద్దెరాగడి వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వేగంగా ఢీ కొట్టింది. స్థానికులు క్షతగాత్రుడిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌రెడ్డి తెలిపారు.

మహాత్ముని మార్గం సదా ఆచరణీయం




మంచిర్యాలలో భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు


మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్


బెల్లంపల్లిలో ఆర్డీఓ హరికృష్ణ


గుడిపేట పోలీసు పటాలంలో కమాండెంట్ వెంకటరాములు, సిబ్బంది

జన్నారం, నస్పూర్, హాజీపూర్, మంచిర్యాల పట్టణం, మందమర్రి పట్టణం, బెల్లంపల్లి పట్టణం, కాసిపేట, భీమారం, మంచిర్యాలఅర్బన్, మంచిర్యాల విద్యావిభాగం, రామకృష్ణాపూర్, కోటపల్లి, చెన్నూరు, బెల్లంపల్లి గ్రామీణం, తాండూరు, న్యూస్‌టుడే : మహాత్ముని మార్గం సదా ఆచరణీయమని.. ఆయన జీవితం జాతికే సందేశమంటూ పలువురు కొనియాడారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ఆయా కాలనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ప్రముఖులు పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. మహాత్ముని సిద్ధాంతాలు నేటి యువతకు ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ఆయన పాత్రను కొనియాడారు. సత్యం..అహింసా..స్వచ్ఛత విషయంలో ఆయన బాటలో నడుస్తామని ప్రతినబూనారు.


కాసిపేటలో..


మందమర్రిలో కాంగ్రెస్ నాయకులు


జన్నారంలో...


నస్పూర్‌లో పుర కమిషనర్ సతీష్..


కోటపల్లిలో..

సేవ చేయడం గొప్ప అలవాటు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : సమాజంలో ప్రజలకు సేవ చేయడం గొప్ప అలవాటని జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద నూతనంగా నమఃఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆయన ప్రారంభించారు. ప్రతి అమావాస్య అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజనులకు సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఆకాంక్షించారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పున్నం చంద్రు, యువజన అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా యువ జన సంఘం అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్

స్వచ్ఛతా హీ సేవా

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఎంగిలి పూల బతుకమ్మ కోసం వివిధ ప్రాంతాల నుంచి రైతులు పూలు తీసుకొచ్చి బుధవారం మంచిర్యాలలోని అర్చన టెక్స్ చౌరస్తా పక్కన రహదారిపై అమ్మకాలు చేశారు. రద్దీ పెరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఆ రోడ్డు గుండా వెళ్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఉప్పలయ్య తన వాహనాన్ని పక్కకు ఆపి ట్రాఫిక్ కానిస్టేబుల్‌లా వ్యవహరించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించారు. మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు తయారు చేసే కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్మన్ ఆర్. ఉప్పలయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. అక్కడ తడి, పొడి చెత్తను వేర్వేరుగా విడదీసి ఎరువులు తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది.


శుభ్రత పనులు చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఉప్పలయ్య

ఊరూరా గ్రామ సభలు

హాజీపూర్, మందమర్రి పట్టణం, నెన్నెల, న్యూస్‌టుడే : గాంధీ జయంతిని పురస్కరించుకొని పంచాయతీల్లో 2025-25 ఆర్థిక ఏడాదిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు మండలంలోని 17 పంచాయతీల్లో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. వేంపల్లి, ముల్కల్ల, హాజీపూర్, దొనబండ, గుడిపేట గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.


ముల్కల్లలో పనులపై సూచనలు చేస్తున్న ఏపీవో మల్లయ్య

బతుకమ్మ సంబరం.. ఘనంగా ఆరంభం


హాజీపూర్ : పోలీసు పటాలంలో కమాండెంట్ వెంకటరాములు దంపతులు

మంచిర్యాలఅర్బన్, కాసిపేట, హాజీపూర్, చెన్నూరు, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి గ్రామీణం, బెల్లంపల్లి పట్టణం, తాండూరు, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రతీకగా నిలిచే పూల పండగ బతుకమ్మ జిల్లా కేంద్రంలో బుధవారం అంగరంగ వైభవంగా ఆరంభమైంది. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చిన మహిళలు తమ కాలనీలు, వీధుల్లో అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు, చిన్నారులు తమ నృత్యాలతో వేడుకలను స్వాగతం పలికారు.


బెల్లంపల్లి పట్టణం కన్యకా పరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చెన్నూరు పద్మశాలి భవనంలో..


ఆర్కేపీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హమాలివాడలో...

బోర్డు తొలగించడంతో మహిళ ఆత్మహత్యాయత్నం

నస్పూర్, న్యూస్‌టుడే : హైకోర్టు నోటీసుతో తన ఇంటి ముందు ఉన్న బోర్డును స్థానికులు తొలగించడంతో ఓ మహిళ మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్‌లోని సుభాష్ నగర్‌లో కొప్పు సుగుణ ఇంటి నంబరు 16-178లో 40 ఏళ్లుగా నివాసం ఉంటుంది. 2022లో ఆమెకు రెవెన్యూ అధికారులు సింగరేణి 220 గజాల స్థలంతో ఇళ్ల పట్టా ఇచ్చారు. ఇటీవల తన ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలంలో జాతీయ జెండాతో ఉన్న గద్దెను తొలగించి ప్రహరీ ఏర్పాటు చేసింది. దీంతో స్థానికులు ఏళ్లుగా గద్దె వద్ద బతుకమ్మ ఆడుతున్నామని, జాతీయ జెండాను ఎగురవేస్తున్నామని మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు ప్రహరీని తొలగించి జాతీయ జెండాతో గద్దెను ఏర్పాటు చేశారు. ఆమె ఆ స్థలం తనదేనంటూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇచ్చిన నంబరుతో గద్దె పక్కన బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు బతుకమ్మ వేడుకలకు బోర్డు ఆటంకంగా ఉందని తొలిగించాలని మళ్లీ మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బుధవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది బోర్డు తొలిగించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' ఎస్సై సంతోష్‌ను వివరణ అడగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

పుర ఛైర్‌పర్సన్ భర్త వ్యాపార సముదాయాల మూసివేత

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని శనిక్కుంట మత్తడి ధ్వంసం కేసులో అనుమానితుడైన పురపాలిక ఛైర్‌పర్సన్ అర్చనగిల్డా భర్త రాంలాల్‌గిల్డాకు సంబంధించిన పట్టణంలోని అతడి వ్యాపార సముదాయాలను బుధవారం స్థానిక పోలీసులు మూసివేయించి తాళాలు వేశారు. పేలుడు పదార్థాలతో మత్తడిని పేల్చిన ఘటన ఇటీవల స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనలో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన విచారణ ఇంకా కొనసాగుతుండగా అనుమానితులను విచారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈక్రమంలో గత నెల 27న కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడిశెల బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్‌తో పాటు లక్కం రాజబాపులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సమయంలో కేసులో అనుమానితులుగా ఉన్న పుర ఛైర్‌పర్సన్ భర్త రాంలాల్‌గిల్డా, భాజపా నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బత్తుల సమ్మయ్య ఇళ్లకు పోలీసులు వెళ్లగా వారు అందుబాటులో లేకపోవడంతో రాంలాల్‌గిల్డా కుమారుడు రోహిత్ గిల్డాతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టారు. రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుంచి పరారీలో ఉన్నారు. తాజాగా రాంలాల్‌గిల్డాకు చెందిన రైస్‌మిల్, అటుకుల గిర్నీలతో పాటు ఆయన భవనంలో కొనసాగుతున్న రిలయన్స్ మార్ట్, ట్రెండ్స్ షోరూంలను మూసివేసి తాళాలు వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాంలాల్‌గిల్డాకు సంబంధించిన వ్యాపార సముదాయాలను మూసివేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు.


రాంలాల్‌గిల్డా రైస్‌మిల్లుకు తాళాలు వేస్తున్న పోలీసులు

బంగారంపై కన్నేసి.. కాజేసి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు పరిచయం ఉన్న వివాహిత ఒంటిపై కనిపించిన బంగారు ఆభరణలపై కన్నేసింది. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలని పన్నాగం పన్నింది. బంధువుతో కలిసి చోరీకి పాల్పడి చివరకు పోలీసులకు చిక్కింది. కరీంనగర్ నగర ఏసీపీ జి.నరేందర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. పిట్టల ప్రశాంత్ (గ్రానైట్ వ్యాపారి), భార్య లహరి (గృహిణి)లు కరీంనగర్ ప్రగతినగర్‌లో ఉంటున్నారు. సెప్టెంబర్ 24 మధ్యాహ్నం లహరి బయటకు వెళ్లి రాగా ఇంటికి మరోవైపు ఉన్న తలుపు తీసి ఉంది. బీరువాలోని 187 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, రెండో ఠాణా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. బాధితురాలు లహరి, నిందితురాలు త్రిపురాని లహరి అలియాస్ శిరీష గతంలో రాంనగర్‌లో పక్కపక్కనే అద్దెకు ఉన్నారు. లహరి మరో ఇల్లు మారినా.. శిరీష వెళ్లి పలకరిస్తుండేది. గణేశ్ నవరాత్రుల సందర్భంగా లహరి ఒంటిపై బంగారు ఆభరణాలను గమనించిన శిరీష.. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలనుకుంది. చోరీ జరిగే ముందు రోజు లహరి ఇంటికి వెళ్లి ప్రధాన ద్వారం కాకుండా పక్కన ఉండే మరో ద్వారం బేడం తీసి వచ్చింది. ఎప్పుడు ఆ ద్వారంను ఉపయోగించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దృష్టి సారించలేకపోయారు. 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఖాజీపూర్‌కు చెందిన తన మేనబావ చిలుకాని రాజశేఖర్‌తో కలిసి ఇంట్లోకి చొరబడి బంగారాన్ని అపహరించింది. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నారు. రూ.5 లక్షల విలువగల 187 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ జైలుకు పంపించినట్లు ఏసీపీ తెలిపారు.

వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

భీమారం, న్యూస్‌టుడే : అటవీ ప్రాంతంలోని వన్యప్రాణి సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని గొల్లవాగు జలాశయం వద్ద బుధవారం వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన బర్డ్ వాచ్ కార్యక్రమంలో ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

చెన్నూరు గ్రామీణం : కిష్టంపేట అర్బన్ పార్కులో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలను జిల్లా అటవీ శాఖ అధికారి(డీఎఫ్‌వో) శివ్ ఆశిష్ సింగ్ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జన్నారం, న్యూస్‌టుడే : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని వరంగల్ ఆర్‌జేడీ కాటేపల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం అక్కపెల్లిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆయన దుస్తులు అందజేశారు.

పండగొచ్చె.. సందడి తెచ్చె

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : బతుకమ్మ పండగ సందర్భంగా వివిధ రకాల పూలు విక్రయాలు కోసం చిరువ్యాపారులు, రైతులు రాగా మందమర్రి మార్కెట్‌లో సందడి నెలకొంది. సాయిబాబా ఆలయం నుంచి మార్కెట్ లోపలి వరకు మూడు వరసల్లో పూల విక్రయాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. పూలను కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున వినియోగదారులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.


మందమర్రి మార్కెట్‌లో పూలు విక్రయాలతో సందడి

జాయింట్ సర్వే కాకుండానే ఆక్రమణకు యత్నం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాలోని సంజీవని హనుమాన్ ఆలయం భూముల జాయింట్ సర్వే పూర్తి కాకుండానే మళ్లీ ఆక్రమణకు యత్నించారు. ఎంతో చరిత్ర కలిగిన బండరాయి గుట్టను బుధవారం జేసీబీతో తవ్వటం ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న ఎండోమెంట్ అధికారులు, స్థానికులు అక్కడకు చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. ఇప్పటికే రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు మూడుసార్లు జాయింట్ సర్వే చేపట్టారు. హద్దులు పూర్తిగా తేల్చకపోవడంతో వివాదం కొనసాగుతూనే ఉంది. ఆలయానికి 3.02 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి చాలా వరకు కబ్జాకు గురైంది. ఆలయ భూములను కాపాడుకోవడానికి ఎండోమెంట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా బండను తవ్వే పనులను నిలిపివేశారు. రోడ్డు పక్కన ఉన్న మురుగును గుట్ట అవకతవకలకు తరలించడానికి తవ్వుతున్నారు. జాయింట్ సర్వే పూర్తయ్యేదాకా ఎవరు ఆక్రమణలకు పాల్పడవద్దని ఎండోమెంట్ అధికారులు చెప్పారు.

కాల్‌టెక్స్‌లో ప్రభుత్వ భూమి కబ్జా!

బెల్లంపల్లి పట్టణం: పట్టణంలోని కాల్‌టెక్స్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 104లో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతారు. మరుసటి రోజు ఓ వ్యక్తి పేరుతో హైకోర్టు స్టే ఆర్డర్ ఉందంటూ మరో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ నెల 1న రాత్రికి రాత్రే సిమెంటు ఇటుకలతో రేకుల షెడ్డు నిర్మించారు. 2009 సంవత్సరంలో 104 సర్వే నంబరులో ఉన్న భూమి ప్రభుత్వ భూమే అంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రెండు బోర్డులు పాతడం ఆసక్తికరంగా మారింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నోటీసులు జారీ చేసి చర్యలు చేపడతామని తహసీల్దార్ జ్యోత్స్న చెప్పారు.


కాల్‌టెక్స్‌లోని వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూమి

చేతులు కలిపారు.. బడిని బతికించారు

న్యూస్‌టుడే, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ :

గ్రామస్థుల తోడ్పాటు, తల్లిదండ్రుల అండ, గ్రామ ఉద్యోగుల సహకారం వెరసి ఆ ప్రభుత్వ బడి నేడు సమస్యలు లేని ఆదర్శ బడిగా రూపుదిద్దుకుంది. అదే బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరిలో గతేడాది 50 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసించేవారు. పిల్లల సంఖ్య తగ్గడంతో గ్రామాభివృద్ధి కమిటీతో పాటు పిల్లల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇద్దరే ఉండటం కారణంగా కనిపించింది. సమస్యను పరిష్కరించేందుకు వీడీసీ ఆధ్వర్యంలో ఒక వాలంటీరును నియమించారు. అతడికి నెలకు రూ.7,500 పారితోషికం అందించారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లల పోషకులు, వీడీసీ, గ్రామ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. పాఠశాలలోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అడుగులు వేశారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గ్రామస్థులు నియమించిన విద్యా వాలంటీరు


పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఇలా ముందుకు సాగుతున్నారు

పాఠశాల ప్రారంభంలోనే గ్రామస్థులంతా సమావేశమయ్యారు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో అప్పటికే కొనసాగుతున్న వీవీతో పాటు పోషకులు తమ సొంత ఖర్చులతో మరో వీవీని నియమిస్తామని ముందుకొచ్చారు. ఇందుకు ఒక కమిటీని నియమించుకున్నారు. ప్రతి నెల అతడికి రూ.6 వేల పారితోషికం అందిస్తున్నారు. దాతల సహాయంతో కుర్చీలను అందించారు. రూ.40 వేలు ఖర్చు చేసి రెండు గేట్లను ఏర్పాటు చేశారు. రూ.10 వేల ఖర్చుతో బీరువా కొన్నారు. రూ.10 వేలతో ఐడీ కార్డులు అందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో 70 బ్యాగులు అందించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 67కి చేరింది. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు రావడంతో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు వాలంటీర్లు అక్కడ పని చేస్తున్నారు. బడి తోటతో పాటు పరుచుకున్న పచ్చదనం పాఠశాలకు ఎంతో అందాన్నిస్తుంది.

చాలా సంతోషంగా ఉంది

- సురేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల అభివృద్ధికి పిల్లల పోషకులు, వీడీసీ సంఘం సభ్యులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు గ్రామస్థుల సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుకుంటున్నాం.

ఇక్కడే చదివిస్తాం

- రాజేందర్, పోషకుడు



ప్రైవేటులో వేలల్లో ఫీజులు కట్టి చదివించే స్తోమత లేదు. పాఠశాలలో సమస్యలు తీర్చేందుకు వీడీసీతో పాటు దాతలు ముందుకొస్తున్నారు. మేము కూడా కొంత మా పిల్లల కోసం ఖర్చు చేస్తున్నాం. నాణ్యమైన విద్య ఇక్కడే దొరుకుతోంది.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

- భోజారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పిప్పిరి



ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుంది. మా సంఘ సభ్యులంతా కలిసి చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకొని బడిని బాగు చేసుకుంటున్నాం. పిల్లలను పోషకులు ప్రభుత్వ బడికి పంపడమే మా కోరిక.

దుమ్ము దులిపేస్తోంది..!

● సింగరేణిలో వాయు కాలుష్య నియంత్రణ యంత్రం ప్రారంభం

ఎలా పనిచేస్తుందంటే..

బొగ్గు గనుల ప్రాంతంలో వాయు కాలుష్య నియంత్రణ, కార్మిక సంక్షేమానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లపై దుమ్ము, ధూళిని నియంత్రించేందుకు కదిలే వాయు కాలుష్య (ఫాగ్ కెనాన్) యంత్రాన్ని బెల్లంపల్లి ఏరియాలో గత నెల 25న ప్రారంభించింది. గనుల ఏర్పాటులో భాగంగా ఈసీ సూచన మేరకు తొలిసారిగా దీన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్ల కాలపరిమితితో టెండరు ప్రక్రియ ద్వారా రూ.1.23 కోట్లు వ్యయం చేశారు. ఒక లారీకి నీటి ట్యాంకర్, 30 కేవీ జనరేటర్‌ను బిగించారు. దిల్లీ నుంచి తీసుకొచ్చిన ఈ యంత్రాన్ని లారీకి వెనుక భాగంలో అమర్చారు. లారీ నడుస్తున్న తరుణంలో దాని నుంచి నీళ్ల తుంపర్లు దూసుకొని వస్తుంటాయి. దీంతో దుమ్ము నివారణతో పాటు గాలిలోని కాలుష్యాన్ని నివారించేందుకు దోహదపడుతుంది.



సింగరేణి అంటే బొగ్గు గనులతో కూడిన ప్రాంతం. నిత్యం బొగ్గు లారీలు, పెద్ద వాహనాల రాకపోకలతో రోడ్ల వెంబడి దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తుంటుంది. వాయు కాలుష్యానికి కారణమవుతుంది. యాజమాన్యం ఏటా లక్షల కొద్దీ మొక్కలు పెంచుతూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. మరింత నియంత్రణకు ఆధునిక సాంకేతికతో కూడిన ఓ యంత్రాన్ని కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాలో గనులు విస్తరించి ఉండగా.. బెల్లంపల్లి ఏరియాలో మొదటగా ఈ యంత్రాన్ని ప్రవేశపెట్టింది.

ఏయే ప్రాంతాల్లో..

ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి సీహెచ్‌పీ వరకు సింగరేణి రహదారి మీదుగా నిత్యం బొగ్గు లారీల రాకపోకలు కొనసాగుతుంటాయి. ఈ యంత్రాన్ని ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి టౌన్‌షిప్, దుబ్బగూడెం, భగత్‌సింగ్‌నగర్, రేకులగూడ, గోలేటి క్రాసు రోడ్డు మీదుగా గోలేటి సీహెచ్‌పీ వరకు నిత్యం తిప్పుతుంటారు. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ యంత్రం ఎంతో దోహదపడుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు.

- న్యూస్‌టుడే, గోలేటి టౌన్‌షిప్

నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలో నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి గానూ నిర్దేశించిన ప్రణాళికను అమలుచేయాలన్నారు. పనులను గుర్తించి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని ఈ నెల 5లోగా గుర్తించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్డీవో కిషన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

బాలాలయంలోనే.. గంగనీళ్ల ఉత్సవాలు

● శని, ఆదివారాల్లో జాతర

సారంగాపూర్, న్యూస్‌టుడే: వరుసగా రెండో ఏడాది 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు అడెల్లి మహా పోచమ్మ బాలాలయంలోనే జరగనున్నాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా అమ్మవారిని ఆలయంలో ప్రతిష్ఠించనందున నూతన ఆలయం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నెల 5, 6వ తేదీల్లో జాతర జరగనుండగా ఈవో రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దసరాకు ముందు వచ్చే మహాలయ అమావాస్య తదుపరి శని, ఆదివారాల్లో గంగనీళ్ల జాతర జరపడం ఆనవాయితీ. శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలుచేసి, అమ్మవారి ఆభరణాలతో ఆలయ సేవాదారులు శోభాయాత్రగా గోదావరి నదికి పయనమవుతారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలం మాడెగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వి గ్రామాల నుంచి సాయంత్రానికి గోదావరి తీరానికి చేరుతుంది. రాత్రికి అక్కడే జాగరణ చేస్తారు. ఆదివారం వేకువజామున గోదావరి నీటితో ఆభరణాలను శుద్ధి చేసి పాదయాత్రగా తిరిగి అదే మార్గంలో సాయంత్రానికి పోచమ్మ ఆలయానికి చేరుకుంటారు. తీసుకొచ్చిన జలాలను స్థానిక కోనేటి నీటితో కలిపి అమ్మవారికి అభిషేకం చేసి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులు దర్శించుకోవడంతో జాతర ముగుస్తుంది.


బాలాలయంలో పోచమ్మ తల్లి

ఏర్పాట్లు పూర్తి:

జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయినా మందిరం ప్రారంభం కాకపోవడంతో బాలాలయంలోనే జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. నిర్మల్, భైంసా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు సైతం నడపాలని విజ్ఞప్తి చేశాం. **-రమేష్, ఆలయ ఈవో**

సామాజిక మాధ్యమాల పోస్టులపై ప్రత్యేక నిఘా

మంచిర్యాలనేరవిభాగం : చట్టవ్యతిరేకమైన పలు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మతాన్ని, కులాన్ని ద్వేషించేలా చేస్తున్న పోస్టులపై పోలీసుల నిఘా ఉందని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి ఒడిలో దేవాపూర్!


ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో దేవాపూర్ గ్రామం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ వర్షాలతో పచ్చదనం సంతరించుకుంది. కొండాకోనల్లో ఎక్కడ చూసినా జలపాతాల గలగలలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గూడేలు, తండాలే కాదు పెద్ద పంచాయతీలు సైతం పచ్చదనం మాటున దాగి ఉన్నాయి. సాధారణంగా కొండాకోనల్లో దట్టమైన అడవుల్లో అయిదు నుంచి పది ఇళ్లు ఉండే చిన్న తండాలు దూరం నుంచి చూడటానికి అందంగా కనిపిస్తాయి. అక్కడ పూర్తిస్థాయిలో ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో ఉండవు. ఇక్కడ మీకు ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో అందంగా కనిపిస్తున్న ఈ గ్రామం తలమడుగు మండలం దేవాపూర్. మండలంలోనే మేజర్ పంచాయతీగా పేరు పొందింది. ఇక్కడ 865 కుటుంబాలు ఉండగా జనాభా 2,955 మంది ఉన్నారు. ఎటు చూసినా పచ్చదనంతో పాటు చల్లని వాతావరణం వీరి సొంతం. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో పక్కనే ఆదిలాబాద్ పట్టణం సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. అక్కడ ఉండేందుకు ఇక్కడి ప్రజలు ఇష్టపడరు. **- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తలమడుగు**

51 ఏళ్లుగా ఒకే తరహా విగ్రహాలు

● మందమర్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకత

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం: మంచిర్యాల జిల్లా మందమర్రి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మాత్రం భిన్నం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో ఇక్కడ దేవీ శరన్నవరాత్రి వేడుకలను 1974 సంవత్సరం నుంచి 51 ఏళ్లుగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు ప్రారంభించిన కొత్తలో పశ్చిమబెంగాల్ నుంచి అధికారులు ఏళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ క్రమంలో కోల్‌కతా నగరంలో ప్రతిష్ఠించే కాళీమాత విగ్రహాన్ని పోలిన విధంగా ఇక్కడ అదే తరహా ప్రతిమలను తయారు చేయిస్తున్నట్లు పూజారి అనంతాచార్యులు తెలిపారు.

కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన కళాకారులు రెండు నెలల పాటు శ్రమించి మట్టి, గడ్డితో 7-8 అడుగుల విగ్రహాన్ని తయారు చేశారు. అమ్మవారి విగ్రహంతో పాటు వినాయకుడు, కుమారస్వామి, లక్ష్మీదేవి, సరస్వతి దేవి విగ్రహాన్ని సిద్ధం చేశారు. మొదటి నుంచి ఒకే తరహాలో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి సుమారు 80 వేల మంది భక్తులు వస్తుంటారు. దసరా రోజు రాత్రి ఇక్కడ పూజలు నిర్వహించిన తర్వాతనే సింగరేణి మైదానంలో సింగరేణి యాజమాన్యం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రామ్‌లీలా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు.


పూజలు అందుకోనున్న దేవతామూర్తుల విగ్రహాలు


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

అంబరం.. క్రీడా సంబరం

● ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: క్రికెట్ అంటే అందరూ ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. ఆ ఆటకు ఉన్న గుర్తింపే వేరు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను చూసి వారిలాగే తామూ ఎదగాలని దానిపై మక్కువ పెంచుకున్న ఎంతో మంది నిత్యం తర్ఫీదు పొందుతుంటారు. వివిధ టోర్నీల్లో ఆడి తమదైన ఆట తీరును ప్రదర్శిస్తుంటారు. అలాంటి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వీటిని చేపట్టగా ఉమ్మడి జిల్లాకు చెందిన నాలుగు జట్ల బాలురు హాజరయ్యారు. నాలుగు జిల్లాల మధ్య పోటీలు పోటాపోటీగా సాగాయి. ఫైనల్‌లో మంచిర్యాల, నిర్మల్ జిల్లా జట్లు తలపడగా విజేతగా నిర్మల్ జిల్లా నిలిచింది. విజేత జట్టు ఈనెల 7 నుంచి 10వ తేదీ మధ్య జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.


తలపడుతున్న జట్లు

అట్టహాసంగా ప్రారంభం

పోటీలకు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి ఆటపై ఉన్న మక్కువ చూపి టోర్నీ ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని నిత్యం తర్ఫీదు పొందుతూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంఈవో కె.శంకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ పార్థసారధి, పెటా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భుక్య రమేశ్, కె.భోజన్న, క్రీడల నిర్వాహకుడు వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, సాయి, గోపాల్, భూమేశ్, రాంరాజ్, శ్రీనివాస్, సంతోష్, సునీల్, సుదర్శన్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి..:



మాది తాంసి మండలం పొన్నారి గ్రామం. తల్లిదండ్రులు లతీష్‌రెడ్డి-గీతారెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. మక్కువను గుర్తించి అమ్మానాన్న నన్ను ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ అక్కడే ఓ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాను. గత ఏడాది ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనగా నాలోని ప్రతిభను చూసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జడ్చర్లలో జరిగిన టోర్నీలో ఉత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంతో నేషనల్‌కు ఎంపిక చేశారు. అయితే ఆ పోటీలు జరగలేదు. దీంతో అందులో పాల్గొనే అవకాశం రాలేదు. **- ఓం క్షీరాజ్‌రెడ్డి, ఆదిలాబాద్**

ఆల్‌రౌండర్‌గా..: సోమ ఇషాన్‌రెడ్డి, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. ఏడేళ్ల ప్రాయంలో క్రికెట్‌పై మక్కువ పెరిగింది. మాది జైనథ్ మండలం పెండల్‌వాడ. తల్లిదండ్రులు ప్రభాకర్‌రెడ్డి-రాధారెడ్డి వ్యాపారం చేస్తుంటారు. నాలోని అభిరుచి గుర్తించి వారు నన్ను ఓ ప్రైవేటు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. అక్కడ తర్ఫీదు పొందుతూ వివిధ పోటీల్లో పాల్గొన్నాను. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాను. గత సంవత్సరం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో జరిగిన జోనల్ స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతోపాటు అక్కడ మంచి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. అవి జరగకపోవడంతో ఆడే అవకాశం కోల్పోయాను.

రెండు నెలల వ్యవధి.. తండ్రీకుమార్తెలకు టీచరు కొలువులు

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు ఉద్యోగాలు సాధించడం సాధారణం. ఇందుకు భిన్నంగా రెండు నెలల వ్యవధిలో తండ్రీకుమార్తెలు టీచరు కొలువులకు ఎంపికయ్యారు. వారే జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన వాయిలే రమేష్, ప్రణయశ్రీ. ఆగస్టు 2న సోషల్ వెల్ఫేర్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బాలుర గురుకులంలో హిందీ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)గా వాయిలే రమేష్ ఎంపికై విధుల్లో చేరారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ప్రణయశ్రీ ఎంపికయ్యారు. ఓపెన్ కేటగిరీలో 42వ ర్యాంకును సాధించిన ఆ యువతి తండ్రితో కలిసి బుధవారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కొంతకాలంగా తండ్రీకుమార్తెలు తమ గ్రామంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో టీచర్లుగా పని చేస్తుండగా.. ఒకరి తర్వాత మరొకరు ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం విశేషం. ఇంటి నుంచి ఒక్కరికే ఉద్యోగం రావడం గగనంగా మారిన ప్రస్తుత తరుణంలో తండ్రి 48 ఏళ్ల వయసులో.. ఆయన కుమార్తె 20 ఏళ్ల ప్రాయంలో సర్కారు కొలువులు సాధించి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు. వయోపరిమితి గడువు ముగుస్తున్న సమయంలో తనకు ఉద్యోగం రావడం సంతృప్తినిస్తే.. ఇప్పుడు అందరూ తండ్రికి తగ్గ తనయ అని కూతురిని పొగుడుతుంటే మనసు ఉప్పొంగుతోందని రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.


ఎస్జీటీగా ఎంపికైన కుమార్తె ప్రణయశ్రీతో కలిసి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన తండ్రి రమేష్

- ఈనాడు - ఆదిలాబాద్

- న్యూస్‌టుడే - పాలనాప్రాంగణం

జాతీయస్థాయి ఖోఖోలో తెలంగాణ జట్టుకు రజతం

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఝార్ఖండ్‌లో నిర్వహించిన 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు రజత పతకం సాధించింది. తుది పోరులో మహారాష్ట్ర జట్టుతో హోరాహోరీగా పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓడి రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ జట్టులో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాఠోడ్ శివసాయి, ఆత్రం శివచరణ్, పెందూర్ హన్మంతు, ఆత్రం యాదవ్‌షావ్ ఉండడం విశేషం. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, డీడీ ఎ.వసంత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ పీడీ దయానంద్ రెడ్డి, తెలంగాణ జట్టు కోచ్ శివకృష్ణ, ఉమ్మడి జిల్లా ఖోఖో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.



రజత పతకం సాధించిన తెలంగాణ జట్టు